క్లుప్తంగా

గాయత్రీ సత్యదేవ మందిర వార్షిక బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: స్థానిక ఏటీ అగ్రహారంలోని శ్రీ కంచి కామకోటి పీఠ శంకర గాయత్రీ సత్యదేవ మందిరంలో శుక్రవారం వార్షిక బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ప్రారంభించారు. పదిహేను మంది రుత్విక్కులతో, వేద పండితుల వేద స్వస్తితో వైభవంగా మొదలయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ అధ్యక్షులు రాళ్లబండి వేంకట సత్యరామాంజనేయశర్మ పర్యవేక్షించారు.

సూపర్ స్టార్ కృష్ణ చిరస్మరణీయుడు



లక్ష్మీపురం: నిజ జీవితంలోనూ మనసున్న మనిషిగా సినీ రంగంలో తనకంటూ ప్రత్యేకత ను సంపాదించుకున్న జి.కృష్ణ ఎప్పటికీ తెలుగు వారి సూపర్ స్టార్‌గా నిలిచి పోతారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, గాయకుడు శ్యామల కోటిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం సూపర్ స్టార్ కృష్ణ జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మాట్లాడుతూ సినీ పరిశ్రమలో మంచి మనిషిగా నిర్మాతగా హీరోగా, నటశేఖరుడిగా సూపర్‌స్టార్‌గా పిలిపించుకున్న కృష్ణ 340కి పైగా చిత్రాలలో నటించారన్నారు. అనంతరం సంస్థ సభ్యులు మేకల పురుషోత్మ ప్రసాద్, సుబ్బారావు, కోటిరెడ్డి, థామస్ పాల్గొని నివాళులర్పించారు.

79 కిలోల లడ్డూతో అభయాంజనేయునికి పూజలు



నగరంపాలెం: స్థానిక ఏటుకూరు రోడ్డు శ్రీ సువర్చలా సమేత అభియాంజనేయస్వామి వారి 22 వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా హనుమత్ జయంతి ఉత్సవాలు శుక్రవారం కొనసాగాయి. ఉదయం 79 కిలోల లడ్డుతో విశేష పూజలు, వేద మంత్రాల నడుమ భక్తి శ్రద్ధలతో చండీ హోమం, బాల పూజ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం సుందరకాండ అహోరాత్ర హోమం, లక్ష తమలపాకుల అర్చన చేపట్టారు. ఈ సందర్భంగా అర్చకులు రాజకుమార్‌శర్మ మాట్లాడుతూ శనివారం మహాపూర్ణాహుతి, 79 కిలోల లడ్డు వేలం పాట, మహా అన్న దానం కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు.

డ్రాయింగ్ పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రపంచ పొగాకు వ్యతిరేకదినం సందర్భంగా విద్యార్థులకు శుక్రవారం డ్రాయింగ్ పోటలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు డ్రాయింగ్, పేపర్ ఆర్ట్, కథలు, కథానికలు నేర్చుకుని సృజనాత్మక నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని సూచించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుంటూరు ఈస్ట్: గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కుందులరోడ్డులో సుమారు 55 సంవత్సరాల గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు స్థానికులు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831346 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉపాధి కూలీలకు సమ్మర్ అలెవెన్స్ ఇవ్వాలి

తాడేపల్లి రూరల్: ఉపాధి హామీ కూలీలకు సమ్మర్ అలవెన్స్ అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం దుగ్గిరాల గ్రామంలో ఉపాధి హామీ కూలీలను కలసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ మే నెలలో ఎండలు తీవ్రంగా ఉన్నాయని, కాబట్టి వారికి అలవెన్స్ అమలు చేయాలని, మంచినీరు, టెంట్, మెడికల్ కిట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. దుగ్గిరాల మండల గ్రామాల్లో ఇప్పటికీ పలుగు, పార అందజేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో సుబ్బారావు, వరదయ్య, చెంచు రాజు, భాగ్యలక్ష్మి, పద్మశ్రీ పాల్గొన్నారు.

ఎండ.. ప్రచండం..




- రోహిణీ కార్తె ప్రభావం
- 45 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు
- మరి కొద్ది రోజుల ఇదే పరిస్థితి
- అల్లాడుతున్న జనం

నెహ్రూనగర్: రోహిణీ కార్తె అంటే రోకలి పోట్లు గుర్తుకొస్తాయి.. ఆకులు చిగురించే కాలం.. ఇటీవల వాతావరణంలో మార్పులతో వర్షం పడింది.. నైరుతి రుతుపవనాల కబురుతో రోహిణీ ప్రభావం ఉండదని అంతా భావించారు. కానీ జులువిదుల్చుతోంది. తూర్పు తెల్లవారడమే తరువాయి.. భానుడు చెలరేగిపోతున్నాడు. అగ్ని వర్షం కురిపిస్తున్నాడు. నింగి వీధుల నుంచి నిప్పుల వాన కురిపిస్తున్న సూర్యుడు తోడుగా.. వాయు దేవుడు కూడా వేడెక్కిపోతున్నాడు. బయటకు వెళ్లినా.. ఇంట్లో ఉన్నా భగభగలాడుతున్న ఎండ, వేడి గాలులకు తాళలేక ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. పొద్దుపొద్దున్నే మొదలవుతున్న వడగాడ్పులు రాత్రవుతున్నా ఉపశమించకపోవడంతో అల్లాడిపోతున్నారు. రోళ్లు పగిలేలా ఎండలు కాస్తాయని పెద్దలు చెప్పే రోహిణీ కార్తె ప్రారంభమై ఆరు రోజులైంది. నాటి నుంచి శుక్రవారం వరకు 45 డిగ్రీల పైబడిన ఉష్ణోగ్రతలు నమోదువుతుండటం, వడగాడ్పులు వీస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వాతావరణం అగ్నిగుండాల్ని తలపిస్తోంది. జిల్లా కేంద్రమైన గుంటూరులో రెండు రోజులుగా 44 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత నమోదు కాగా, శుక్రవారం ఏకంగా 45 డిగ్రీలకు చేరింది.

తుఫాన్ ప్రభావంతో

వారం రోజుల క్రితం రెమాల్ తుఫాన్ ప్రభావం వల్ల కొద్ది రోజుల కురిసిన వర్షాలతో వాతావరణం చల్లబడిందని సామాన్యులు సంతోషించారు. గడుస్తున్న కొద్ది ఈ రోహిణీ కార్తెలో భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. మరో వైపు వాతావరణంలో తేమ శాతం పెరగడంతో తీవ్ర ఉక్కపోతతో, ధారళంగా కారిపోతున్న చెమటలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్ర 4 గంటల వరకు కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తోంది. రోడ్ల వెంబడి తోపుడు బండ్లు, చిన్న చిన్న వ్యాపారులు మధ్యహ్నాం సమయంలో దుకాణాలు మూసివేసి, సాయంత్రం తెరుస్తున్నారు. మధ్యలో ఒకటి రెండు రోజులు మినహా వచ్చే నెల 5వ తేదీ దాకా ఇదే రీతిలో ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని భావిస్తున్నారు. ఎండలకు విద్యుత్ వినియోగం పెరిగిపోయింది. ఫ్యాన్లు, ఏసీలు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అనే తేడా లేకుండా పని చేస్తూనే ఉన్నాయి.




టెన్త్‌లో మారిన పాఠ్యాంశాల బోధనపై అవగాహన



మాట్లాడుతున్న దశపతిరావు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతిలో కొత్తగా ప్రవేశపెట్టిన పాఠ్యాంశాల బోధనపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత డీవైఈఓ కె.దశపతిరావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ(ఆపస్) ఆధ్వర్యంలో శుక్రవారం అరండల్‌పేట మూడో లైనులోని యోగి భవన్‌లో సంఘ జిల్లా అభ్యాసనవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న దశపతిరావు మాట్లాడుతూ టెన్త్‌లో మారిన పాఠ్యాంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు కె.బాల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి పి.పద్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాసరావు, నాయకులు డి.నాగభారతి, డి. శివపార్వతి, మురళీకృష్ణ, వై.రమ, ఆదినారాయణ, డి.రామాంజనేయులు, కిషోర్ పాల్గొన్నారు.

అకౌంటెంట్ సత్యనారాయణకు సన్మానం



సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న వైద్య ఉద్యోగులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో అకౌంటెంట్‌గా పనిచేస్తూ శుక్రవారం పదవీ విరమణ చేసిన పి.సత్యనారాయణకు ఘన సన్మానం జరిగింది. స్థానిక ఏపీ ఎన్జీవో అసోసియేషన్ హాలులో జరిగిన సన్మాన కార్యక్రమానికి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జీజీహెచ్‌లో అకౌంటెంట్‌గా చేసిన సేవలను కొనియాడారు. జీజీహెచ్‌లో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన పిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ పద్మలత, జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ సత్యశ్రీనివాస్, డ్రైవర్ బత్తుల వెంకటేశ్వర్లులను ఘనంగా సత్కరించారు.

ఆర్టీసీ బస్సు- క్రేన్ ఢీకొని ఇద్దరికి గాయాలు



ధ్వంసమైన బస్సు, క్రేన్ ముందు భాగం

తెనాలిరూరల్: ఆర్టీసీ బస్సు, క్రేన్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయాలపాలవగా రెండు వాహనాలూ ధ్వంసమయ్యాయి. స్థానిక యడ్ల లింగయ్య పెట్రోలు బంకు రోడ్డులోని ఆషా థియేటర్ వద్ద పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు- క్రేన్ ఢీకొన్న ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. గుంటూరు నుండి వస్తున్న ఆర్టీసీ బస్సు ప్రయాణీకులని దించి బస్ స్టేషన్ వైపుకు వెళుతుండగా ప్రియ డీలక్స్ వైపు నుంచి క్రేన్ రోడ్డు పైకి రావడంతో అదే సమయంలో అతివేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు క్రేన్‌ని ఢీ కొట్టింది. క్రేన్ ముందు భాగం, టైర్ పగిలి పోయింది. ఇదే సమయంలో క్రేన్ పక్కగా స్కూటీపై వెళుతున్న షేక్ అషీబా, రాజశేఖర్ లకు గాయాలయ్యాయి. గాయాలైన వారిని స్థానికులు 108 ద్వారా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు మరొక ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసి అతివేగంగా రావటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని క్రేన్ యజమాని ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ప్రమాదంలో క్రేన్ సహా ఆర్టీసీ బస్సు ఎడమ భాగం పాక్షికంగా ధ్వంసమైంది. అంత పెద్ద ప్రమాదం జరిగినా ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నగర పుర వీధుల్లో స్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో కళాకారుల వాయిద్య ప్రదర్శన



స్వామి వారి గ్రామోత్సవం



లక్ష ఆకు పూజ

నగరంపాలెం: స్థానిక కొత్తపేటలోని శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో శ్రీ స్వామివారి హనుమత్ జయంతోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం పంచామృత సపన్న, లక్ష ఆకు పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా కొద్దిపాటి మంది భక్తులతో స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. మంగళ వాయిద్యాలతో శ్రీ హనుమాన్ దీక్షా సమాజం వారి ఆధ్వర్యంలో నగర పుర వీధుల్లో ఊరేగించారు. స్వామి వార్ల వేషధారణలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ శ్రీనివాస్, చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ముఖ్యఅర్చక స్వామి, శ్రీహనుమాన్ దీక్షా సమాజం గౌరవ అధ్యక్షులు తిరువల్లూరి వెంకటసుబ్బారావు, సభ్యులు, నాగేశ్వరరావు, అనిల్‌కుమార్, వంశీ, జగదీష్, రమేష్, రమణ పాల్గొన్నారు.

పొగ తాగేవారిలో షుగర్ వ్యాధి వచ్చే అవకాశం

గుంటూరు మెడికల్: పొగ తాగేవారిలో షుగర్ వ్యాధి వచ్చే అవకాశం ఉందని, 30 నుంచి 40 శాతం షుగర్ వ్యాధి రావచ్చని షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ అన్నారు. నో టుబాకో డే సందర్భంగా శుక్రవారం స్థానిక కొత్తపేటలోని ఎస్‌వీఆర్ షుగర్ హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డాక్టర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ పొగ తాగడం వలన గుండె వ్యాధులు వస్తాయని, కిడ్నీలు ఫెయిల్ అవుతాయని, చూపు మందగిస్తుందని చెప్పారు. కాళ్లల్లో రక్త ప్రసరణ తగ్గిపోయి, కాళ్లల్లో చురుకు మంటలు వస్తాయని హెచ్చరించారు. ధూమపానం వదిలేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పొగ తాగే వారికి నిద్ర సరిగా పట్టదని చెప్పారు. షుగర్ ఉన్నవారు సిగరెట్ తాగడం వల్ల షుగర్ నియంత్రణలో ఉండదని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ ధూమపానానికి దూరంగా ఉండాలని చెప్పారు.

నేటితో ముగియనున్న వేసవి శిక్షణ శిబిరం



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం నేటితో ముగియనున్నదని నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని అమరావతి ఐకాన్ క్లబ్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బాలోత్సవాల కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ, ఎంటీఎంసీ బాలోత్సం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ 22 రోజుల పాటు నిర్వహించిన బాలల వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగియనున్నదని, ఆదివారం ముగింపు సభను ఏర్పాటు చేసి శిక్షణ శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్‌ను అందజేస్తామని, ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేయనున్నామని వారు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో నృత్యం నేర్చుకున్న చిన్నారులతో నృత్య ప్రదర్శన నిర్వహించనున్నామని, ఈ ముగింపు సభకు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి డాక్టర్ రావి శారద, కాన్ఫడరేషన్ ఆఫ్ అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ తాడేపల్లి అధ్యక్షుడు జీఎస్‌ఆర్ మోహనరావు, బాలోత్సవం గౌరవాధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, అమరావతి ఐకాన్ మిత్ర బృందం యడ్ల బాలకృష్ణ తదితరులు హాజరు కానున్నారని వివరించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ఫ్రైడే- డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి గాబులు శుభ్రంగా ఉంచుకోవాలని, ఫ్రిజ్‌లు వారానికోమారు శుభ్రంగా తుడుచుకోవాలని సూచించారు. ఇంటి చుట్టుపక్కల పరిసరాలు శుభ్రతతో పాటు, ఎండిన కొబ్బరిబోండాలు, పాత టైర్లు నిలువ ఉంచకుండా చూసుకోవాలన్నారు. మురుగు కాలువల్లో నీటి పారుదల సక్రమంగా ఉండేలా చూడాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

విజయకీలాద్రిపై హనుమజ్జయంతి వేడుకలు



తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై హనుమాన్ జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం ఆంజనేయస్వామికి ఉదయం పంచామృతాలతో విశేష అభిషేకం, మన్యుసూక్త హోమం, ప్రత్యేక అలకంరణ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. సాయంత్రం తమలపాకులతో స్వామి వారికి అష్టోత్తర శతనామార్చన, మడమాల సేవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు పేర్కొన్నారు. శనివారం హనుమాన్ జన్మోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంత స్వామి పాల్గొన్నారు.

పొగాకు జోక్యం నుంచి పిల్లలను రక్షిద్దాం

ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ భాస్కరరావు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న భాస్కరరావు, వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: పొగాకు ఉత్పత్తుల నుంచి పిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రభుత్వ ఛాతి, సాంక్రమిక వ్యాధుల ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. శుక్రవారం నో టుబాకో డే సందర్భంగా గోరంట్లలోని ఆస్పత్రిలోని పొగాకు అనర్థాలపై అవగాహన ర్యాలీ, రోగులకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ నిర్వహించారు. డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ 1987లో మే 31న ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవంగా ప్రకటించిందన్నారు. నాటి నుంచి ప్రతిరోజూ మే 31న పొగాకు నష్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పొగాకు వాడకం వల్ల 20 రకాల క్యాన్సర్లు వస్తాయని చెప్పారు. ప్రతి ఏడాది ఎనిమిది లక్షల మంది పొగాకు బారిన పడుతున్నారని, ప్రపంచ వ్యాప్తంగా 67 వేల మంది చనిపోతున్నారని చెప్పారు. 15 నుంచి 19 ఏళ్ల వయస్సు గల యువత 2.67 కోట్ల మంది పొగాకు వాడుతున్నట్లు వెల్లడించారు. పొగాకు వాడకంలో భారత దేశం రెండో స్థానంలో ఉందని, పొగ పీల్చేవారి కంటే పొగాకు తినే వారు ఖైనీ, గుట్కా, జరదా తినేవారు ఎక్కువ మంది ఉన్నారన్నారు. క్యాన్సర్ వ్యాధులు 25 శాతం పొగాకు వల్ల వస్తున్నాయన్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ వల్ల 80 శాతం మంది చనిపోతున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.లక్ష్మీకుమారి, ఇన్‌చార్జి ఆర్ఎంఓ డాక్టర్ సృజన, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ గురవయ్య, డాక్టర్ జంగా త్రివేణి, డాక్టర్ కళ్యాణ్ పాల్గొన్నారు.

మలబార్‌లో వజ్రాభరణాల ప్రదర్శన



వజ్రాభరణాలను ప్రదర్శిస్తున్న అతిథులు

నగరంపాలెం: గుంటూరు లక్ష్మీపురంలోని మలబార్ గోల్డ్-డైమండ్స్ షోరూంలో వజ్రాభరణాల ప్రదర్శన(మైన్ డైమండ్స్)ను డాక్టర్ శ్రీహర్ష రావూరి, వ్యాపారవేత్త పెద్ది రమణారావు శుక్రవారం ప్రారంభించారు. రోజూ ధరించే నగలు, వివాహ ఆభరణాలు, లైట్ వెయిట్ ఆభరణాలు, పురుషుల, ప్లాటినం ఆభరణాల సముదాయాన్ని అందించనున్నారు. ఇష్టమైన ఆభరణాలను సొంతం చేసుకునేందుకు మే 31 నుంచి ఈనెల ఐదు తేదీ వరకు వజ్రాభరణాల ప్రదర్శన కొనసాగతుందని షోరూం హెడ్ నదీర్, మార్కెటింగ్ మేనేజర్ గోపీకిరణ్‌లు తెలిపారు. వినియోగదారులు కొనుగోలు చేసే బంగారం విలువలో ఐదు శాతం ముందుగా చెల్లించి, అడ్వాన్స్ బుకింగ్ సదుపాయాన్ని పొందవచ్చునని చెప్పారు. తద్వారా భవిష్యత్‌లో పెరిగే బంగారం ధరల నుంచి లబ్ధి పొందవచ్చునని పేర్కొన్నారు. ఈ ఆఫర్‌లో నగలు కొనుగోలు చేసిన వారు, బుక్ చేసిన రోజు ధర గానీ కొనుగోలు చేసిన రోజు ధరలో ఏదీ తక్కువ ఉంటే ఆ ధర చెల్లించే అవకాశం ఉందన్నారు. తమ వినియోగదారులకు పది న్యాయమైన వాగ్దానాలను అందిస్తున్నట్లు చెప్పారు. అందులో కచ్చితమైన తయారీ ధర, రాళ్ల/ నికర బరువు, ఆభరణాల రాళ్ల విలువ తదితర వాగ్దానాలను అందిస్తున్నామని వారు పేర్కొన్నారు.

ఉద్యోగ విరమణ పోలీస్ సిబ్బందికి సత్కారం



ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెచ్‌సీలను సన్మానిస్తున్న అధికారులు

నగరంపాలెం: సుదీర్ఘ కాలం క్రమశిక్షణ, బాధ్యతతో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయమని జిల్లా ఏఎస్పీ(క్రైం) శ్రీనివాసరావు అన్నారు. డీసీఆర్బీ ఎస్ఐ రామబ్రహ్మం, ఆర్ఎస్ఐ వి.వెంకటరావు, ఏఎస్ఐలు ఎస్.వెంకటేశ్వరరావు(నల్లపాడు), దుర్గాప్రసాద్ (అరండల్‌పేట), మల్లికార్జునరావు (తెనాలి ఒన్‌టౌన్), హెడ్‌కానిస్టేబుళ్లు పీవీ నరసింహరావు (తెనాలి ఒన్‌టౌన్), నాగేశ్వరరావు(తెనాలి త్రీటౌన్) శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని హాల్‌లో వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఏఎస్పీ మాట్లాడుతూ శేష జీవితం మంచి ఆరోగ్యంతో ఉండాలని, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరిరెడ్డి, జిల్లా పోలీసు సంఘం ప్రతినిధులు కరుణాకర్, కరిముల్లా, లక్ష్మణ్, మైలా సాంబశివరావు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

గుంటూరు రూరల్ మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆదినారాయణ, ఎంపీపీ పద్మావతి, ఏఎంసీ చైర్మన్ రవిదేవరాజు

గుంటూరు రూరల్: గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా తగిన జాగ్రత్త చర్యలు పాటించాలని ఎంపీడీఓ ఆదినారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రూరల్ మండలం సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఇంటూరి పద్మావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గతంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. అదేవిధంగా రానున్న కాలంలో చేపట్టాల్సిన కార్యాచరణను వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మౌలిక వసతులు కల్పన ఎంతో అవసరమని చెప్పారు. వేసవిలో ప్రజా సమస్యలు, డ్రెయినేజీ, తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. మండల అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆళ్ళ రవిదేవరాజు, వైఎస్ ఎంపీపీ దర్శి సుజాత, ఎంపీటీసీలు భూలక్ష్మి, కో-ఆప్షన్ సభ్యుడు కరిముల్లా, ఇంటూరి అంజిరెడ్డి, దుగ్గెంపూడి యోగేశ్వర్‌రెడ్డి, ముక్కమళ్ళ సాంబిరెడ్డి, సర్పంచ్‌లు మబ్బు శిరీష, నల్లమేకల అప్పమ్మ, మాధవరావు, పంచాయితీ కార్యదర్శులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



కృష్ణ జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న నిర్వాహకులు

నగరంపాలెం: స్థానిక అమరావతిరోడ్‌లోని అన్నదాన సమాజం ఆడిటోరియం ఆవరణలో శుక్రవారం రాత్రి ఆర్ఎస్ ఈవెంట్స్ 18వ వార్షికోత్సవం నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు మునిపల్లె రమణి అధ్యక్షతన సినీ సంగీత విభావరి నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన అఖిల భారత పంచాయతీ పరిషత్(ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, ఏపీ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ బిళ్ళ అశోక్, ఉన్నం శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. గాయనీ, గాయకులు మునిపల్లె రమణి, శనివారపు శిరీష, బెల్లంకొండ భారతి, డాక్టర్ సుశీల్ కుమార్, పత్రి లలిత్ బాబులు సూపర్ స్టార్ కృష్ణ, వివిధ చిత్రాల్లోని గీతాలను ఆలపించారు. ప్రేక్షకులను అలరించాయి. కీబోర్డుపై సురేష్, జెర్మియ, తబలాపై రమణ, విజయ్ పాల్ ప్యాడ్స్, లక్ష్మణ్ వాయిద్య సహకారం అందించారు. అనంతరం సూపర్ స్టార్ కృష్ణ జయంతి, రమణి పుట్టిన రోజు సందర్భంగా కేక్‌లు కట్ చేయగా, మూర్తి వార్షికోత్సవ వేడుకలను పర్యవేక్షించారు.